# ఎపఫ్రొదితు జీవితములో గల లక్షణాలు

## వాక్యభాగాలు

"నా సహోదరుడును, జతపనివాడును నాతోడి యోధుడును, మీ దూతయు, నా అవసరమునకు ఉపచరించినవాడునైన ఎపఫ్రొదితు  మీ యొద్దకు పంపుట అగత్యమని అనుకొంటిని. అతడు రోగియాయెనని మీరు వింటిరి గనుక అతడు మిమ్మునందరిని చూడ మిగుల అపేక్షగలవాడై విచారపడుచుండెను. నిజముగా అతడు రోగియై చావునకు సిద్ధమైయుండెను గాని దేవుడతనిని కనికరించెను; అతనిమాత్రమేగాక నాకు దుఃఖము మీద దుఃఖము కలుగకుండుటకై నన్నును కనికరించెను. కాబట్టి మీరు అతనిని చూచి మరల సంతోషించు నిమిత్తమును నాకున్న దుఃఖము తగ్గునిమిత్తమును అతనిని మరి శీఘ్రముగా పంపితిని. నా యెడల మీ ఉపచర్యలో ఉన్న కొదువను తీర్చుటకై అతడు తన ప్రాణమునైనను లక్ష్యపెట్టక క్రీస్తు యొక్క పని నిమిత్తము చావునకు సిద్ధమైయుండెను గనుక పూర్ణానందముతో ప్రభువునందు అతని చేర్చుకొని అట్టివారిని ఘనపరచుడి (ఫిలిప్పీయులకు 2:25-30).

"నాకు సమస్తమును సమృద్ధిగా కలిగియున్నది. మీరు పంపిన వస్తువులు  ఎపఫ్రొదితు వలన పుచ్చుకొని యేమియు తక్కువలేక యున్నాను; అవి మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునై యున్నవి" (ఫిలిప్పీయులకు 4:18).

## ఎపఫ్రొదితు గురించి మీరెప్పుడైనా విన్నారా? వింటే ధ్యానం చేసారా?

ఫిలిప్పీ పత్రిక కొంచెం "స్లో" గా చదివితే 15 నిమిషాల్లో అయిపోతుంది. ఫిలిప్పీ పత్రికలో ఆయన పేరు 2 సార్లు మాత్రమే కన్పిస్తుంది. ఆయన గురించి నిత్యం సత్యాలు నేర్చుకోవచ్చు.ఎపఫ్రొదితు ఎవరో? ఆయన నుండి మనమేమి నేర్చుకోగలమో! ఈ సందేశంలో చూడగలం.

- ఎపఫ్రొదితు అనగా సౌందర్యవంతుడు. సౌందర్యం మనోహరం, అని అర్థాలున్నాయి. గ్రీకు పురాణ దేవత చాలా సుందరమైనది, అందమైనది. తల్లిదండ్రులు గ్రీకు విగ్రహారాధికులు. అందుచేత అతనికి ఆ గ్రీకు దేవత పేరునుబట్టి పేరు పెట్టారు. ఎపఫ్రొదితు అనే పేరు డైరెక్టగా ఎవరు పెట్టుకోవడం చూడలేదు. ఆ పేరు అర్థాలు పెట్టుకున్నవారు బోలెడంతమంది ఉన్నారు. ఒకవేళ ఉంటే అరకొర ఉండొచ్చు. తెలుగులో ఎపఫ్రొదితు అని పిలుస్తాం. ఇంగ్లీషులో పేఫ్రొడైటిస్ అని పిలుస్తారు

పౌలు సాక్ష్యం - నా సహోదరుడును, జతపనివాడును, నాతోడి యోధుడును, మీ దూతయు, నా అవసరమునకు ఉపచరించిన వాడునైన ఎపఫ్రొదితును మీ యొద్దకు పంపుట అగత్యమని అనుకొంటిని. (ఫిలిప్పీయులకు 2:25-30).

Source: Pas Abhisheck

## 1.అతడు నా సహోదరుడు

ఒకే తల్లిదండ్రులకు పుట్టినవాడని కాదు. పరలోకమందున్న తండ్రి వలన పుట్టిన వాడు గనుక సహోదరుడు అన్నాడు. తిమోతిని నా కుమారుడవైన తిమోతి అన్నాడు. పౌలు ద్వారా రక్షింపబడినవాడు తిమోతి. ఎపఫ్రొదితును

సహోదరుడు అన్నాడు. ఒకే తల్లిదండ్రులకు జన్మించినవారిని సహోదరులు అంటాం. ఒకే దేశంలో పుట్టినవారిని సహోదరుడు అంటాం. తోటి విశ్వాసినిసహోదరుడు అంటాం. రక్తం పంచుకుని పుట్టినవారు సహోదరులు. క్రీస్తునందు మనమంతా సహోదరి, సహోదరులం. పౌలు తన స్వంత జాతివారిని ఎక్కువగా సహోదరులని పిలిచాడు

(రోమా 10:1; 9:3). 1తిమో 5:1-2 లో పాఠకులను కూడా సహోదరులు అని పిలవడం ఆనవాయితీగా ఉంది. కొన్ని సంఘాలలో అభిషిక్తులు, నాయకులు, పెద్దపెద్దవారు, ధనవంతులు సంఘంలో ఒక వర్గంగా, మిగతావారంతా తక్కువ వర్గంగాను ఉంటారు. బెస్ట్ చర్చి ఏదంటే! సంఘసభ్యులంతా సహోదర, సహోదరీలు అని పిలువబడేది. మరొక పౌలు ఎపఫ్రొదితుని సహోదరుడని పిలవడం. అతడు రక్షించబడినవాడని గ్రహించాలి. అతని రక్షణను సందేహించలేదు. కారణం ఆయనలో మారుమనస్సుకు తగిన ఫలాలు చూసాడు.

## 2.అతడు నా జతపనివాడు

ఎపఫ్రొదితు పౌలుతో కలసి ప్రక్కప్రక్కనే ఉండి పనిచేశాడు. నేను కళ్ళారా చూసాను అన్నట్టుగా రాస్తున్నాడు. ఇదే అధ్యాయంలో యిలా చెప్పాడు“నా యెదుట ఉన్నప్పుడు మాత్రమేగాక, మరి యెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును, భయముతోను, వణకుతోను మీ పనిని (సొంత రక్షణను) కొనసాగించుకొనుడి (2:12). ఈ మాటలో ఎంతో భావం స్ఫురిస్తుంది. మొన్న చేసాను, నిన్న చేసాను, ఈవేళ చేస్తున్నాను, రేపు కూడా చేస్తాను, ప్రతిరోజు చేయగలను అని చెప్పడం కాదు పని చేసి తీరాలి.

ప్రభువు మనగురించి ఇలా అనగలడా? ఊహించగలమా? ఎపఫ్రొదితులా జీవించడానికి మనకు ఆశ ఉందా? మన పనిని మనం పరిశీలించుకుందాం. మనం బ్రతకడానికి ఎన్నో పనులు చేస్తున్నాం మంచిదే చేసుకోవాలి. ప్రభువు కొరకు ఏం చేస్తున్నామో ప్రశ్నించుకుందాం.

## 3.అతడు నా తోటియోధుడు

తోటి యోధుడు అంటే ఎడతెగని ప్రమాద పరిస్థితులలో, పనిలో నిమగ్నమై యుండడం. సమస్యలను అధిగమించడం. క్రీస్తు సైన్యంలో అతడొక సైనికుడు (2 తిమోతి 2:3-4). సత్యాల మీద ఆధారపడి సత్యం కోసం ముఖ్యంగా సంఘసత్యం కోసం పోరాడేవాడు యోధుడే. ఎపఫ్రొదితు జీవితం ఒక సిద్ధాంతం కాదు,ఆచరణాత్మకం ఎంతో మాదిరికరమైన జీవితం

Source: Pas Abhisheck

## 4.అతడు మీ దూత

దూత అనగా వార్తాహరుడు అంటాం. ప్రధాని మంత్రి దగ్గరకు లేక రాష్ట్రపతి దగ్గరకు ఫలానివారిని దూతగా పంపారు అని వింటుంటాం.సమాచారాన్ని అందించడం, అవసరాన్ని బట్టి ప్యాకేజి, ఐటమ్స్ను చేరవేయడం, దైవ గ్రంథంలో సేవకులు దూతలుగా పరిగణించబడ్డారు. “యాకోబు ఎదోము దేశమున, అనగా శేయీరు దేశముననున్న తన సహోదరుడైన ఏశావు నొద్దకు “దూతలను” తనకు ముందుగా పంపెను" (ఆదికాండము 32:3-4).

“ఆ దూతలు యాకోబు నొద్దకు తిరిగివచ్చి - మేము నీ సహోదరుడైన ఏశావు నొద్దకువెళ్ళితిమనిరి" (ఆదికాండము 32:6). ఫిలిప్పీ సంఘముచేత రోమా చెరసాలలో ఉన్న పౌలుకి సంరక్షణ ప్యాకేజిని ఈ దూత ద్వారా పంపిస్తున్నారు. సంఘానికి పౌలుకి మధ్యలో దూతగా పనిచేసాడు ఈ ఎపఫ్రొదితు.

## 5 .అతడు నాకు పరిచర్య చేయువాడు

ఎపఫ్రొదితు పరిచర్య మిక్కిలిగా కొనియాడదగింది. ఇతడు చాలా ప్రాముఖ్యమైన పాత్ర వహించాడు. పౌలు రోమా చెరలో ఉన్నాడు. సంఘాన్ని కుటుంబాన్ని విడిచి నిర్ణయించబడిన పనిమీద వెళ్ళాడు. పరిచర్య అంటే ఆయనకు ప్రాణం. తనకంటే పౌలును ఎక్కువగా ప్రేమించాడు. ఫిలిప్పీ నుండి రోమ్కు 1170 కి.మీ. మనకు బస్సు దాటిపోతే మరో బస్సుకు, ట్రైన్ దాటిపోతే మరో ట్రైన్కి, ఫ్లైట్ దాటిపోతే మరో ఫ్లైట్కి వెళతాం. ఇది అలాంటి ప్రయాణం కాదు. చాలా కష్టమైనది. పర్వతాలు నదులు దాటుకుంటూ ఇంకొకరికి పరిచర్య చేయడంలో త్యాగం ఉంది. ఎపఫ్రాదితుని మనస్సులో పెట్టుకొని సంఘాన్ని హెచ్చరించాడు. “మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీయులకు 2:4). అంటే అందరు స్వంత కార్యాలను చూసుకుంటుండగా ఎపఫ్రొదితు ఇతరుల కార్యములను చూస్తున్నాడని అర్థం. పౌలు రెండు సంవత్సరములు రోమా చెరలో ఉన్నాడు. అంతర్గతంగా పౌలు పరిచర్యలో చేదోడువాదోడుగా ఉన్నాడు. దీన హృదయంతో పౌలుకు సేవ చేశాడు. ఇది చాలా విలువైన సేవ మనకెంత ప్రజ్ఞా పాటవాలు ఉన్నా ఎదుటివారికి గౌరవ ప్రదంగా సేవచేసే దీనమనస్సు మంచి హృదయం ఉండాలి. భక్తిభావం ఉంటే గానిచేయలేని పని. “నా యెడల మీ పూర్ణానందముతో ప్రభువునందు అతనిని చేర్చుకొని అట్టి వారిని ఘనపరచుడి" (ఫిలిప్పీయులకు 2:29 - 30) అని హెచ్చరిస్తున్నాడు పౌలు.

## 6. అతడు ప్రాణాన్ని లక్ష్యపెట్టనివాడు

ఎపప్రాదితు ధైర్యవంతుడు. తన ప్రాణాన్ని ఫణంగా పెట్టడంలో మొదటివాడు. అనేకమైన ప్రమాదాలు ఎదురొన్నాడు. అతడు పార్లమెంట్ భవనంలోనికో, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఇంటిలోకో వెళ్ళడంలేదు. చెరలో ఉన్న పౌలు దగ్గరికి వెళ్తున్నాడు. ఎపబ్రాదితు అకుల-ప్రిస్కిల్లలను స్ఫూర్తిగా తీసుకుని ఉంటాడు. రెండు రకాల మనుష్యులు ప్రాణాన్ని లక్ష్యపెట్టరు. ఒకటి అమరప్రేమ కలిగినవారు, రెండు అవమానాన్ని భరించలేనివారు. అదికూడా ఎక్కడైన, ఎప్పుడైనా చాలా అరుదుగా మాత్రమే. భార్యకోసం భర్త, భర్తకోసం భార్య ప్రాణం త్యాగం చేసారని కథలలో చదువుతాం.

Source: Pas Abhisheck

ఇది కథ కాదు. ప్రాణం లక్ష్యపెట్టని ఎపఫ్రొదితు జీవితం ఒక వీర గాథ. ఎపఫ్రొదితు చిరస్మరణీయుడు. జీవితంలో అత్యంత కష్టమైన విషయం ఏంటంటే ఇతరుల కొరకు నిశ్చింతగా ప్రాణాలర్పించడమే. ప్రభువు నిమిత్తమే అతడు ప్రాణాన్ని సైతం అర్పించాలనుకున్నాడు. ఇది కొందరికి విస్మయంగా ఉంటుంది. ప్రభువును ప్రేమించడం, పౌలును ప్రేమించడం కారణం క్రీస్తు రక్త సంబంధం. అది గర్వించదగిన విషయం. మనమెవరమో తెలియకుండా మన దేశ సరిహద్దుల్లో మన వీరజవాన్లు మనకొరకు ప్రాణాలర్పిస్తారు. ఎపదితు దేవుని సేవకుని కోసం ప్రాణాలు లక్ష్యపెట్టలేదు. ఇతరులకు సహాయంచేయడానికి మనం కొంచెమైన త్యాగం చేయాలి.

## 7. అతడు డబ్బు విషయంలో నమ్మకమైనవాడు

"మీరు పంపిన వస్తువులు ఎపఫ్రొదితు వలన పుచ్చుకొని యేమియు తక్కువ లేకయున్నాను"

(ఫిలిప్పీయులకు 4:18)."ఏలయనగా థెస్సలొనికలో కూడ మీరు మాటి మాటికి నా అవసరము తీర్చుటకు సహాయము చేసితిరి" (ఫిలిప్పీయులకు 4:16). వారు సంఘం కావలసినవన్నీ పోగుచేసి పంపించారు. He సంఘంలో ద్వారా అతని ఉనికి ఆనందానికి కారణం. పౌలు తన అవసరాలు ఎవరికీ, ఎన్నడు చెప్పే అలవాటు లేదు. సంఘమే గుర్తించి అతని అవసరతలు తీర్చేవారు. "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును (ఫిలిప్పీయులకు 4:19) అన్నాడు.

ఒక మంచి మాట, క్రైస్తవ సేవకులు తమ ఆర్థిక అవసరతలన్నిటి కొరకు దేవుని విశ్వసించి వాటిని ఆయనకు మాత్రమే చెప్పుకోవాలి. అప్పుడు దేవుడు వారి అవసరతలు తీర్చడానికి తన బిడ్డలను ప్రేరేపిస్తాడు.దేవుని సేవకులకు యిచ్చే యీవులను, కుటుంబ సంబంధ బాంధవ్యాలు నమ్మకత్వం మీద ఆధారపడి నడుస్తాయి. అంతేగాని తాళి బొట్టు (సూత్రం) మీదగాని, రిజిస్ట్రేషన్ మీదగాని (సర్టిఫికెట్) ఆధారపడి ఉండవు. కేవలం నమ్మకం మీదే ఆధారపడి ఉంటాయి. "గోడలకు పగుళ్ళు ఉన్నాయంటే పునాదులను సందేహించవలసిందే"

కానుకలను నొక్కేయ్యకూడదు. ఇది చాలా విచారకరం, దురదృష్టకరం. సంఘమిచ్చిన ఈవులను దొంగిలించు వారి విషయములు అనేకములు చెప్పగలను. డబ్బు విషయంలో అపనమ్మకముగా ఉన్నవారికి దేవుడు ఏమియు యివ్వలేదు. "మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును; మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండువాడు ఎక్కువలోను అన్యాయముగా ఉండును; కాబట్టి మీరు అన్యాయపు సిరి విషయంలో నమ్మకముగా ఉండనియెడల సత్యమైన ధనమును ఎవరు మీవశము చేయును?" (లూకా 16:10-11).

అపనమ్మకంవల్ల మనకు మనమే హాని చేసుకుంటున్నాము. "మీరు మంచి విషయములో ఆసక్తిగలవారైతే మీకు హానిచేయువాడెవడు?" (1 పేతురు 3:13). నమ్మకముగా ఉండే సేవకుడికి, విశ్వాసికి, ఏ దయ్యం కూడా హానిచేయదు. గనుక అపనమ్మకస్థుడు దేవుణ్ణి ప్రేమించడంలేదని, దేవుని సంకల్పము చొప్పున అతడు పిలువబడలేదని గ్రహించవలసియుంది.

నమ్మకస్తులు రెండు రకాలు. 1) నిజమైన నమ్మకస్థులు, 2) నమ్మకస్థులుగా నటించేవారు. ఎపఫ్రొదితులో నమ్మకత్వం ఐక్యమైపోయింది. మోషే దేవుని యిల్లంతటిలో నమ్మకస్థుడు (హెబ్రీయులకు 2:3-5). "కుటుంబ సంబంధ బాంధవ్యాలు

నమ్మకత్వం మీద ఆధారపడి నడుస్తాయి. అంతేగాని తాళిబొట్టు(సూత్రం)మీదగాని, రిజిస్ట్రేషన్ మీదగాని (సర్టిఫికెట్) ఆధారపడి ఉండవు. కేవలం నమ్మకం మీదే ఆధారపడి ఉంటాయి. "గోడలకు పగుళ్ళు ఉన్నాయంటే పునాదులను సందేహించవలసిందే" అన్నాడొక భవన నిర్మాణకుడు. ఆర్థిక విషయాల్లోనమ్మకత్వం తప్పనిసరి. మనం కూడా దేవునితో, దేవుని సేవకులతో నమ్మకత్వంగా ఉండాలని ప్రభువు కోరుకుంటాడు.

## 8 . క్రీస్తు పని నిమిత్తము చావునకు సిద్ధమైయున్నవాడు

పౌలువలె ఎపఫ్రొదితు కూడా సువార్త పనిలో చావ సిద్ధమయ్యాడు. రోమ్లో ఉండగా చాలా రోగగ్రస్తుడయ్యాడు. దాదాపు చావ సిద్ధమయ్యాడని రాయబడింది. అతని బలహీనతకు అతడు కారకుడు కాడు. అక్కడి వాతావరణ పరిస్థితులే కారణం. ఒకవేళ ఎపఫ్రైదితు రోమ్లో చనిపోతే పౌలుకు చాలా యిబ్బంది. దేవుడు సార్వభౌముడు ఆయన తప్పించాడు.. సేవలో ఏదైనా అవాంతరం ఏర్పడితే, దేవుని కిష్టం కాని తప్పిదం, పాపము ఏదో చేసి ఉంటామని అనుకుంటారు కొందరు. అలా తలంచనవసరం లేదు. అపజయం అనేది మనం దేవుని సేవలో ఉన్నప్పటికీ అది మానవ జీవితంలో సామాన్యమైన విభాగం. ఎవరూ తప్పిపోవాలని, ఓడిపోవాలని అనుకోరు. అలాంటి ప్రణాళికలు వేసుకోరు. ఎపఫ్రొదితు అనేక సంవత్సరాలు సేవించడంలో, నడిపించడంలో సహాయపడుటలో ఫిలిప్పీ సంఘానికి ముఖ్యంగా పౌలుకి సేవచేసి ఉంటాడు. మీలో కొందరు అనొచ్చు అన్నా సంఘంలో ఎంత సేవచేసినా వెలుగులోకి రాలేకపోతున్నాం. ప్రసిద్ధి కాలేక పోతున్నాం. అసలు కనీసం గుర్తింపు కూడా ఉండడం లేదు అనొచ్చు. వ్యక్తిగత గుర్తింపు కోసం చేసే పనులు, సేవ వ్యర్థం.. మన పరిచర్యకు ప్రభువు ప్రతిఫలం యిస్తాడు,నిరుత్సాహపడొద్దు.

సువార్త నిమిత్తము (క్రీస్తు నిమిత్తము) "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే చావైతే లాభము" (1:21) అందాము. విశ్వాసి క్రీస్తు కొరకే జీవించాలి. విశ్వాస జీవితంలో నిర్బంధమైనా, అనారోగ్యమైనా, అకస్మాత్తుగా సంభవించిన మరణాలు కావచ్చు, దేవుని సువార్త మరియెక్కువగా ప్రబలమవడానికిఇతరులకు మేలు కలగడానికే దోహద పడుతుంది. దేవుడు కొన్నిసార్లు మన విశ్వాసాన్ని పరిశీలించడానికి కొన్ని పరిస్థితులను మార్చవచ్చు. పరిశీలించిన తర్వాత ఆయన స్వస్థపరచి సంతోషాన్ని సమాధానాన్ని అనుగ్రహిస్తాడు (ఫిలిప్పీయులకు 2:27). మనకు జరుగునది ఏదియు కూడ దేవునిని ఆశ్చర్యపరచదు. ఆయన ప్రతి పరిస్థితి కొరకు ఎప్పుడో ప్రణాళిక వేసి ఉంచాడు. మనము భద్రత లేనివారముగా కంగారుపడవలసిన అవసరము లేదు. ఎపఫ్రొదితు దేవుని సేవలో అర్థవంతమైన గొప్ప పనిచేసాడు.

దేవుణ్ణి వాడుకోమని ప్రాస్పరిటి గాస్పెల్ సేవకులు చెబుతుంటారు. అయితే దేవుడు విశ్వాసిని వాడుకుంటాడనేది వాక్యానుసారమైన సత్యం. రోమాయందు ఎపఫ్రొదితు వ్యాధిగ్రస్తుడై మరణ ద్వారమునకు వెళ్ళాడు. అతని స్వస్థత కొరకు పౌలు, ఫిలిప్పీ సంఘం ప్రార్థించారు. అతడు స్వస్థత పొందిన వెంటనే పౌలు ఈ పత్రికను రాసి అతని చేతికిచ్చి అతన్ని మరల ఫిలిప్పీకి పంపించాడు (ఫిలిప్పీయులకు 2:25-30).

Source: Pas Abhisheck